## వినాయకసదన్‌లో ఈఓ ఆకస్మిక తనిఖీలు

కాణిపాకం, అక్టోబర్ 16 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానంలోని వినాయక సదన్ వసతి సముదాయంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దేవస్థానంలో పెరుగుతున్న భక్తుల దృష్ట్యా వారి సౌకర్యార్థం వినాయకసదన్‌లో నూతనంగా నిర్మించిన 3, 4 అంతస్థుల్లో గదులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయా గదుల్లో భక్తులు కావలసిన ఏర్పాట్లు ఏవిధంగా చేపడుతున్నారనే విషయాలను ఆలయ ఈఈ వెంకట నారాయణతో కలసి పరిశీలించారు. ఈమేరకు గదుల్లో ఏర్పాటు చేస్తున్న నూతన పర్నిచర్ శాంపిల్స్‌ను పరిశీలించి ఆలయ ఈఈ వెంకట నారాయణకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈలు అరవింద్ పవన్‌లు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలకు "అంకురార్పణ"

చంద్రగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలకు గురువారం ఆలయ అర్చకులు అంకురార్పణ గావించారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంట లకు ఆచార్య ఋత్వికరణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయంలో పుణ్యా హవాచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణతో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తం గా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఆలయ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ప్రదాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ఆనుంబట్టు ధనశేఖర్, అర్చకులు నారాయణాచార్యులు, ఆగమ సలహాదారులు పాల్గొన్నారు.

# బాట్లింగ్ ప్లాంట్‌ను ప్రారంభించిన ప్రధాని మోడి



ఇండియన్ ఆయిల్ ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు.

చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:

పూతలపట్టు మండలం ఎర్రచెరువుపల్లి గ్రామంలో 200 కోట్ల రూపాయలు విలువ చేసే ఇండియన్ ఆయిల్ ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్‌ను ప్రధాని నరేంద్రమోడి గురువారం కర్నూలు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. కర్నూలులో ప్రధాని నరేంద్రమోడి పాల్గొన్న కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లు హాజరయ్యారు. పూతలపట్టు ఎర్రచెరువుపల్లిలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు హాజరయ్యారు. సుమారు 200 కోట్ల రూపాయల విలువైన ఈ అత్యాధునిక చిత్తూరు బాట్లింగ్ ప్లాంట్ సంవత్సరానికి 60 వేల మెట్రిక్ టన్నుల బాట్లింగ్ సామర్థ్యంను కలిగి వుంటుంది. ఈ ప్లాంట్ ద్వారా రాష్ట్రంలోని నాలుగు జిల్లాలు, తమిళనాడు రాష్ట్రంలోని రెండు జిల్లాలు, కర్నాటక రాష్ట్రంలోని ఒక జిల్లాకు ఎల్‌పిజి గ్యాస్ సరఫరా అవుతుంది. ఈ ప్లాంట్ 80 మంది పంపిణీదారుల ద్వారా 7.2 లక్షలకు పైగా వినియోగదారులకు సేవలు అందించనుంది. ఈ ప్రాంతంలోని గృహాలు, హోటళ్ళు, పరిశ్రమలకు ఎల్‌పిజి సిలెండర్లను సకాలంలో సరఫరా చేయడంతో పాటు ఇంధన లభ్యతను మరింత బలోపేతం చేయడంలో ఈ ప్లాంట్ కీలకపాత్ర పోషించనుంది. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్టేట్ హెడ్ పీయూష్ మిట్టల్, సీనియర్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు, ఎల్‌పిజి పంపిణీదారులు, స్థానిక పరిపాలన సభ్యులు, పెద్ద సంఖ్యలు ప్రజలు హాజరయ్యారు.

### బాట్లింగ్ ప్లాంట్ ఏర్పాటుతో గ్యాస్ సేవలు వేగవంతం

**- ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**

పూతలపట్టు మండలం ఎర్రచెరువుపల్లి వద్ద 200 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్‌తో రాష్ట్రంలోని నాలుగు జిల్లాలు, తమిళనాడు రాష్ట్రంలోని రెండు జిల్లాలు, కర్నాటక రాష్ట్రంలోని ఒక జిల్లాకు ఎల్‌పిజి గ్యాస్ సేవలు వేగవంతం అవుతాయని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. బాట్లింగ్ ప్లాంట్ ప్రారంభోత్సవం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్లాంట్ ఏర్పాటులో నిరుద్యోగ సమస్య కొంత తీరుతుందన్నారు. రాష్ట్రంలోని అని ప్రాంతాలు అభివృద్ధి చేయడానికి ప్రధాని నరేంద్రమోడి సహకారం అందిస్తున్నారని, రాష్ట్ర ప్రగతే లక్ష్యంగా సిఎం నారా చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.

### సాగర మాల రహదారులు, క్రీజ్ సిటీ పరిశ్రమ

# పనులు వేగవంతం చేయాలి

**రైతులకు నష్టపరిహారాలు పూర్తి స్థాయిలో అందించాలి**

**- జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు**



చిల్లకూరు, అక్టోబర్ 16, ప్రభాతవార్త

సాగర మాల రహదారులు, క్రీజ్ సిటీ పరిశ్రమ పనులు వేగవంతం చేయాలని, రైతులకు నష్టపరిహారాలు పూర్తి స్థాయిలో అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. గురువారం సాగరమాల ప్రాజెక్టు పనులపై సమీక్షించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో సాగరమాల ప్రాజెక్టు కింద గ్రీన్ ఫీల్డ్ హైవేల పనులను ఈ రోజు పరిశీలించారు. ఈ ప్రాజెక్టులు మొత్తం నాలుగు ప్యాకేజీలుగా రూపుదిద్దుకోనున్నాయి. సుమారు 3000 కోట్ల వ్యయంతో 125 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ రోడ్లు ప్రధానంగా చెన్నై-కోల్కతా నేషనల్ హైవేను కృష్ణపట్నం పోర్టుతో అనుసంధానించేలా రూపకల్పన చేయబడ్డాయన్నారు. ప్రధాన ప్యాకేజీలు నాయుడుపేట - కృష్ణపట్నం పోర్టు (సౌత్ గేట్) వరకు సుమారు 36 కిలోమీటర్లు, వరగలి క్రాస్ - కృష్ణపట్నం పోర్టు వరకు సుమారు 35 కిలోమీటర్లు ముత్తుకూరు పరిధిలో సుమారు 19 కిలోమీటర్ల ప్యాకేజీ ఇంకో ఇంటర్నల్ కనెక్టివిటీ ప్యాకేజీ, కలిపి మొత్తం నాలుగు ప్యాకేజీలు గలవని తెలిపారు. ఈ నాలుగు ప్యాకేజీలలో మూడు తిరుపతి జిల్లా పరిధిలో, ఒక ప్యాకేజీ నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్నాయని ఈరోజు అన్ని ప్యాకేజీలను సైట్‌లో పరిశీలించి, భూసేకరణ, మైనింగ్, ఇరిగేషన్ తదితర శాఖలతో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కార చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ పనులలో మూడు ప్యాకేజీలు 2025 డిసెంబర్ నాటికి, మిగతా ప్యాకేజీ 2027 జూన్ నాటికి పూర్తి కానున్నాయని అన్నారు. ఈ హైవేలు పూర్తయిన తర్వాత కృష్ణపట్నం పోర్టుకు కనెక్టివిటీ మరింత బలపడుతుందన్నారు. దీని వలన ప్రాంతీయ పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ మరింత పెరుగుతాయన్నారు. అదేవిధంగా కృష్ణపట్నం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (క్రిస్ సిటీ) ప్రాజెక్టు కింద సుమారు 2500 ఎకరాల్లో 1200 కోట్లతో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు గౌరవ ప్రధానమంత్రి 2025 జనవరిలో శంకుస్థాపన చేశారు. ఇప్పటికే 200 కోట్లకు పైగా పనులు పూర్తి అయ్యాయి. ఈ ప్రాజెక్టు కూడా 2026 డిసెంబర్ నాటికి పూర్తి కానుందని. మొత్తం ..4500 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు గూడూరు నియోజకవర్గ పరిధిలో శరవేగంగా సాగుతున్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఇన్చార్జి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, తేజమయి, తాసిల్దారులు కే శ్రీనివాసులు, జయరావు, ఎన్‌హెచ్‌ఏఐ పిడిఎంకె చౌదరి, మేఘా, పద్మావతి, పరిశ్రమ ప్రతినిధులు మురళీకృష్ణ, ప్రసన్న కుమార్ రెడ్డి, అనీఫ్ పాల్గొన్నారు.

## కల్యాణిరేవులో యువకుడు గల్లంతు

పలమనేరు టౌన్, అక్టోబర్ 16, ప్రభాతవార్త:



కల్యాణిరేవు వద్ద యూనిస్ సెల్ఫీ దిగిన ఫోటో

పలమనేరు రూరల్ మం డలం కాలువ పల్లెకు 5 కి.మీల దూరంలోని అటవీ ప్రాంతంలో గల కల్యాణి రేవులో యూనిస్ (23) అనే యువకుడు గల్లంతయ్యాడు. పలమనేరుకు చెందిన యూనిస్ గురువారం సాయంత్రం స్నేహితులతో కలిసి కల్యాణి రేవుకు వెళ్ళా డు. స్నేహితులంతా కలిసి సెల్ఫీలు తీసుకొని సరదాగా గడిపారు. అందరూ కలిసి ఈతకు వెళ్ళాలని రేవులోకి దిగారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కల్యాణి రేవులో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో స్నేహితులంతా తిరిగి రాగా యూనిస్ మాత్రం జలపాతంలో కొట్టుకు పోయాడు. కొంత సేపటివరకు వెతికినా ఫలితం లేక పోవడంతో పలమనేరుకు తిరిగివచ్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన వెళ్ళి గాలించినా ఫలితం లేక పోయింది. చీకటి పడడంతో పోలీసులు గాలింపు చర్యలు నిలిపివేశారు. కల్యాణిరేవు నుండివెళ్ళే నీరు తమిళనాడు రాష్ట్రం సైనిగుంట్ల వద్ద పాలరునదిపై మోర్దాన ప్రాజెక్టు చేరుతోంది. యూనిస్ మృతదేహం ప్రవాహంలో కొట్టుకు పోయి చివరకు ఎక్కడ చేరుతుందో తెలియడం లేదు.

## దేశమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**

పుత్తూరు (నగరి), అక్టోబరు 16 ప్రభాతవార్త :



నేత్ర ప్రదాతగా పేరొందిన మునిసిపాలిటీలోని శ్రీ దేశమ్మ ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తెలిపారు. ఇటీవల దేశమ్మ ఆలయ దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.ఆర్.మణి కమిటీ సభ్యులతో కలిసి గురువారం తిరుపతిలో ఎమ్మెల్యే భానుప్రకాశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ పురోభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు సమకూరుస్తానని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి వుందన్నారు. నూతన ట్రస్ట్ బోర్డు ఆలయ పవిత్రతకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటూ ఆలయాభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

### రెండు శ్లాబులతో

# అన్ని వర్గాలకు లాభాలు

**రవాణా శాఖ ఆధ్వర్యంలో జిఎస్టీ అవగాహన ర్యాలీ**



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్.

చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:

జిఎస్టీ శ్లాబులు రెండుకు తగ్గించడంతో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ప్రాంతీయ రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద భారీ వాహన ర్యాలీని కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రెండు శ్లాబుల జిఎస్టీతో ప్రతి ఏడాది సుమారు 8 వేల కోట్ల రూపాయల పన్ను అదా అవుతుందన్నారు. జిఎస్టీని నాలుగు నుండి రెండు శ్లాబులకే కుదించి, సుమారు 99 శాతం వస్తువులను 5 శాతం శ్లాబులోకి చేర్చడం వల్ల పన్నులు భారీగా తగ్గుతాయన్నారు. ముడి సరుకుపై కూడా పన్నులు తగ్గడం వల్ల అయా వస్తువుల ధరలు కూడా గణనీయంగా తగ్గుతాయన్నారు. దీనివల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట లభిస్తుందన్నారు. ఆరోగ్యబీమా, మందుల ధరలు సైతం భారీగా తగ్గుతాయన్నారు. తగ్గిన జిఎస్టీ లాభాలను ప్రజలకు తెలియజేయడానికి జిల్లా అంతటా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రవాణా లాజిస్టిక్ పరంగా జిఎస్టీ 2.0 ద్వారా కలిగే ప్రయోజనాలపై ఏర్పాటు చేసిన వాహన ర్యాలీలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు స్వయంగా ట్రాక్టర్‌ను డిటిసీ కార్యాలయం నుండి గాంధీ విగ్రహం వరకు నడిపారు. ర్యాలీ అనంతరం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మాట్లాడుతూ ప్రధాని మోడి, సిఎం నారా చంద్రబాబు నాయుడుల ఆదేశాల మేరకు జిల్లాలో సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్‌లో భాగంగా పలు ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రవాణా లాజిస్టిక్ పరంగా జిఎస్టీ 2.0 ప్రయోజనాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. చిన్న వాహనాల కొనుగోలు ద్వారా సుమారు రూ.1 లక్ష నుండి ఖరీదైన వాహనాలకు రూ.50 లక్షల వరకు తగ్గుతుందన్నారు. డిటిసి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ జిఎస్టీ 2.0 వాహనాల ధరలు, రవాణా, విడి భాగాలు, ఇన్సురెన్స్ మొదలైనవి ధరలు తగ్గుతాయన్నారు. డిటిసి కార్యాలయం నుండి ప్రారంభమైన వాహన ర్యాలీ కలెక్టరేట్ మీదుగా గాంధీ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో మోటర్ సైకిల్ నుండి కార్లు, వ్యాన్లు, ట్రాక్టర్ల వరకు అన్ని రకాల వాహనాలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్ చక్రాల క్రింద పడి సర్వేయర్ దుర్మరణం



నారాయణవనం(నాగలాపురం), అక్టోబర్ 16 ప్రభాతవార్త :

సత్యవేడు నియోజకవర్గం నాగలా పురం మండల రెవెన్యూ సర్వేయర్ సునీత గురువారం సాయంత్రం 6.30గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్ చక్రాల క్రింద పడి మృతి చెందారు. ఆమెతో పాటు సురుటుపల్లి గ్రామ స్వర్వేయర్ దినేష్‌కి తీవ్రగాయాలు ఏర్పడినది. ఈ ప్రమాదానికి సంబందించి పూర్తి వివరాలు ఇలా వున్నాయి. మండల సర్వేయర్ సునీత సురుటుపల్లిలో జరిగిన ఓ రెవెన్యూ సర్వేకు వెళ్లి తిరుగు ప్రయాణంలో సరిగ్గా బైటుకొడిబేడు వద్దకు రాగానే ఊతుకోట వైపు నుంచి పుత్తూరు వైపు వస్తున్న టిప్పర్ మోటారుసైకిల్‌లో వస్తున్న వీరిని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో మండల సర్వేయర్ సునీత చక్రాల క్రింద తగులుకొని అక్కడక్కడే మృతి చెందింది. మరో సర్వేయర్ దినేష్ రోడ్డు పక్కనే పడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. ఇతనిది పిచ్చాటూరు మండలంగా తెలిసింది. చనిపోయిన మండల సర్వేయర్‌ది తిరుపతి కాగా, ఒక కుమారుడు, ఇద్దరు ఆడ పిల్లలు వున్నారు. ఆమె మృతితో రెవెన్యూశాఖ శోకసంద్రంలో మునిగింది. ట్రైనీ ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో భార్యకు నిప్పంటించిన భర్త

చంద్రగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:

మద్యం మత్తులో భార్యపై భర్త పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తొండవాడ సమీపంలోని ఒక తోటలో కాపలాదారులుగా ఓ కుటుంబం వున్నది. భార్య భర్త, ఇద్దరు పిల్లలు వుండగా గతంలో ఒక అబ్బాయి మృతి చెందాడు. ఈ నెల 14న రాత్రి భార్య భర్తలు ఇద్దరూ మద్యం సేవించినట్లు తెలిసింది. ఈ క్రమంలో చోటుకున్న వాగ్వివాదంతో ఆగ్రహించిన భర్త తమ ద్విచక్ర వాహనంలోని పెట్రోల్‌ను తీసుకువచ్చి భార్యపై చల్లి నిప్పంటించాడు. గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలించగా చికిత్స చేసి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలియజేసినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు వెళ్ళడించాల్సి వున్నది.

### యాదమరి తహసిల్దారు కార్యాలయంలో

# దళారులదే రాజ్యం

**నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఉద్యోగులపై ఆరోపణలు**

చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:

యాదమరి తహసిల్దారు కార్యాలయంలో దళారులు రాజ్యమేలుతున్నారు. రెవెన్యూ సమస్యలపై ఎవరికైనా అనుమానాలు వుంటే వారు ఎక్కడైనా నేరుగా తహసిల్దారు లేదా డిప్యూటీ తహసిల్దారు, లేదా రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ లేదా విఆర్‌ఓలను కలిసి సమస్యలను తెలియజేసి వాటిని పరిష్కరించాలని కోరుతారు. అయితే యాదమరి మండల పరిధిలో ఎవరికైనా రెవెన్యూ సమస్య వస్తే వీరు అధికారుల వద్దకు వెళ్ళకుండా దళారులను సంప్రదించి వారికి కొంత మొత్తం ముట్టజెప్పి అధికారులు సమస్యను పరిష్కరించడం లేదని పత్రికలకు ఎక్కుతుండటంతో ఏ పాపం తెలియని తహసిల్దారు కార్యాలయ అధికారులు విచారణలు ఎదుర్కోవాల్సి వస్తోంది. వరదరాజులపల్లి పంచాయతీ సంతగేటు గ్రామంకు చెందిన రమ్య, శరవణలు తమ స్థలంకు పట్టా ఇవ్వాలని వరదరాజులపల్లి సచివాలయ విఆర్‌ఓ రూపను కలిసి విన్నవించారు. దీనిపై మీరు సచివాలయంలో అర్జీ పెట్టండి వచ్చి పరిశీలించి స్థలం ఎవరికి చెందాల్సి వుంటే వారికి పరిశీలించి ఇప్పిస్తాం అని పేర్కొంది. అయితే వీరు నేరుగా దళారులను ఆశ్రయించి రూ.10 వేలు ఇచ్చినా మా పని చేయలేదని విఆర్‌ఓ రేఖపై పత్రికలకు ఎక్కడంతో అర్డీఓ శ్రీనివాసులు ఈ విషయంపై విచారించి నివేదిక ఇవ్వాల్సిందిగా సర్వే డిఐ ప్రసాద్‌ను ఆదేశించారు. అలాగే యాదమరి పంచాయతీ గుట్టకిందవూరు గ్రామంకు చెందిన చంద్రమూర్తికి ఇద్దరు భార్యలు. ఇందులో మొదటి భార్య ఆర్.కుమారమ్మ మృతి చెందడంతో అతని కుమారుడు ఆర్.తులసీకుమార్‌కు చంద్రమూర్తి ఆస్తిపాస్తులపై పూర్తి హక్కు వుంది. అయితే రెండవ భార్య గాయత్రి ఒక ఇంట్లో వుంటూ ఆ ఇల్లు మొత్తం తనదేనని పేర్కొంటూ సర్వే చేసి ఇంటిని తనపై బదలాయించాలని సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకుంది. సర్వేయర్ క్షేత్ర స్థాయికి సర్వేకి వెళ్ళి వాస్తవాలు తెలియడంతో ఈ మేరకు చంద్రమూర్తికి ఇద్దరు భార్యలు వుండగా రెండవ భార్యపై పూర్తి స్థాయిలో ఇంటిని బదలాయించడం సాధ్యం కాదని నివేదిక ఇచ్చాడు. మధ్యవర్తులు కలుగజేసుకుని గాయత్రి నుండి 2,500 రూపాయలు తీసుకున్నారు. అయితే సర్వేయర్ నిదేదిక తనకు వ్యతిరేకంగా ఇవ్వడంతో ఆమె సైతం పత్రికలకు ఎక్కి ఆరోపణలు చేయడంతో అర్డీఓ విచారణకు ఆదేశించారు. తహసిల్దారు పార్థసారథి మాట్లాడుతూ ప్రజలు సమస్య వుంటే నేరుగా తన దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిశీలించి పరిష్కరించడానికి కృషి చేస్తానని, ఎవరిని సంప్రదించకుండా ఎవరికో డబ్బులు ఇచ్చి తాము వారికి అనుకూలంగా పని చేయలేదని ఆరోపించడం భావ్యం కాదన్నారు.

# తూర్పును పలకరించిన ఈశాన్య రుతుపవనాలు

**పొలం పనుల్లో రైతులు బిజీ బిజీ**



శ్రీకాళహస్తి,అక్టోబర్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయ ప్రదాన ప్రాంతం.ఇక్కడ రబీసీజన్లో సుమారు 32వేల హెక్టార్లలో పంటలను పండించటం ఆనవాయితి. గతంలో వరితో పాటు వాణిజ్యపంటలను పండించే వారు అయితే గత కొన్ని సంవత్సరాలుగా కేవలం వరి పంటలనే పండిస్తున్నారు.స్వర్ణముఖి నదీ తీరాన, అలాగే 450చెరువుల ద్వారా నీటిని అందుకొని వ్యవసాయం సాగుతుంది. ఈ ప్రాంతాల్లో సాధారణంగా ఈశాన్య రుతుపవనాల ద్వారా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయి.వరుణుని కరుణ కోసం ఎదురు చూస్తున్న రైతులకు గురువారం నుంచి ప్రారంభమైన రుతుపవనాలు ఊరట కల్పిస్తుంది.శ్రీకాళహస్తి పరిసరాల్లో అక్టోబర్ నుంచి విస్తారంగా ఈశాన్య రుతుపవనాలతో వర్షాలు కురుస్తాయి. రైతులు ముందస్తు ప్రణాళికగా దుక్కులు దున్నుకొని పంటలకు సిద్ధం చేసుకుంటారు. వర్షాలు ప్రారంభం కాగానే వ్యవసాయపనుల్లో తలమునకలౌతారు.ఈ ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాల ద్వారా మూడు నెలల పాటు వర్షాలు కురుస్తాయి.మూడు నెలల్లో వెయ్యి మి.మిలు వర్షం కురుస్తుంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ సాధారణ సగటు వర్షపాతం 229.3 మి.మీలు. ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులుఅ ందించిన సమాచారం మేరకు 125మి.మిల వరషపాతం నమోదైంది. గురువారం నుంచి ఈశాన్య రుతుపవనాలు తాకాయి. గురువారం అర్థరాత్రి నుంచి తెరపలు తెరపలుగా వర్షం కురుస్తుంది. కొంచెం సేపు ఎండ.మరి కొంత సేపు కుండపోతగా వర్షం కురుస్తుంది. వర్షం కురిసిందంటే మున్సిపల్ పరిధిలోని రోడ్లు జలమయమౌతున్నాయి.దాంతో ట్రాఫిక్ స్థంభించి పోతుంది.అక్టోబర్ మొదటి నుంచి అడపా దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. సాధారణంగా దీపావళికి వర్షం కురుస్తుందని చెబుతారు.అక్టోబర్ చివరి నాటికి సాధారణం కన్నా అధికంగా వర్షపాతం నమోదౌతుంది.ఈ నేపథ్యంలో రైతులు ముందుజాగ్రత్తగా వ్యవసాయానికి సిద్దమౌతున్నారు.ఇప్పటికే చెరువుల్లో నీరు చేరుతుంది.

## ఇళ్ల మధ్య చెట్లు: ఇళ్ళలోకి గొంగళి పురుగులు



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఖాళీ స్థలాల్లో రకరకాల చెట్లు పెరిగి నివాశస్తులకు ఇబ్బందిగా మారింది. ఖాళీ జాగా యజమానులు స్పందించకపోవటం మున్సిపల్ అధికారులు తమకు సంబంధం లేదనటంతో ఇళ్ళలోకి 'గొంగళి' పురుగులు, జెర్రిలు, పాములతో తల్లడిల్లుతున్నారు. ఈ సమస్యను కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా అది ప్రైవేటు స్థలమని తామేమి చేయలేమంటూ సమాధానం ఇచ్చినట్లు సమాచారం. శ్రీరామ్‌నగర్ కాలనీలోని పలు లేన్లలో ఖాళీ స్థలాలు ఉన్నాయి వాటి గురించి యజమానులు పట్టించుకోవటం లేదు. దాంతో ఖాళీ స్థలాల్లో ముళ్ళ చెట్లు పాలసముద్రపాకుల చెట్లు అడవిలా పెరిగి నివాసం ఉన్న వారికి ఇబ్బందిగా మారింది. ఈ చెట్ల నుంచి గొంగళి పురుగులు మిద్దెల మీద ఉన్న ఇళ్ళలోకి వస్తున్నాయని భయపడుతున్నారు. రానున్నది వర్షాకాలం ఈ చెట్ల నుంచి పాములు మిద్దెల మీద నివాసమున్న వారి ఇళ్ళలోకి వస్తే పరిస్థితి ఏమిటి? అని వాపోతున్నారు.

## యూరియా కొరత లేదు: రైతులు ఆందోళన వద్దు



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని వ్యవసాయ శాఖాధికారి రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు యూరియా కార్డులను ఆయన అందజేసారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మట్లాడుతూ పొలాలు కల్గిన రైతులు వారి వారి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద రైతు వారి పట్టాను తీసుకెళ్ళి యూరియా కార్డులు పొందవచ్చునన్నారు. ప్రస్తుతం రైతులు యూరియా పొందటానికి పలు నిబంధనలు రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ నిబంధనలమేరకు ప్రతి రైతుకు రైతు సేవా కేంద్రం వినియోగం తెలియాలన్నారు. ఎవరికైతే కార్డు ఉంటుందో వారికే యూరియా లభిస్తుందన్నారు. రాబోయే రబీసీజన్‌కు ఇప్పటికే 700 టన్నుల యూరియా నిల్వ ఉంచినట్లు తెలిపారు. జనవరి వరకు యూరియా అందించే విధంగా ప్రణాళిక రూపొందించి నిల్వ ఉంచామని రమేష్‌రెడ్డి తెలిపారు. రైతు సుధాకర్‌రెడ్డి ఏఓ సురేంద్రరెడ్డి రైతుల పాల్గొన్నారు.

## కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు



**శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త** ఏర్పేడు మండలం ఇసుక తాగేలి గ్రామ పంచాయతీలో కలంకారి, మగ్గం, ఆర్యవర్క్, పెయింటింగ్ కళాకారులకు గురువారం శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాలను ఆర్‌ఎస్‌ఇటిఐ, ఎస్ఇఆర్‌పి–డిఆర్‌డిఏ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలను బొజ్జల రిషితా రెడ్డి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఇసుక తాగేలి గ్రామ సమాఖ్యలోని 35 మందిని ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇవ్వబడుతుందని రిషితారెడ్డి తెలిపారు. నెల రోజుల పాటు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు ఉంటుందన్నారు. మధ్యాహ్నం భోజన వసతి కూడా కల్పించబడిందన్నారు. ఈ శిక్షణలను వాటి ప్రయోజనాలను శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి సుస్థిర జీవనోపాధులు ఏర్పాటు చేసేందుకు ఒక స్థిర నివాసం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని రిషితారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎల్‌డిఎం రవి మాట్లాడుతూ శిక్షణ తరువాత సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం మహిళా నాయకురాలు కృష్ణవేణి, హంసవేణి, పున్నారావు, మహేష్‌రెడ్డి, రెడ్డివారి గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధన్వంతరి జయంతిని విజయవంతం చేయండి: కోలా ఆనంద్

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త** నాయి బ్రాహ్మణుల కులదైవం ధన్వంతరి జయంతిని విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ గురువారం పిలుపు నిచ్చారు. ఈ నెల 18శనివారం ఉదయం 8గంటలకు తిరుపతి పట్టణంలోని గాంధీభవన్‌లో కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆనంద్ వివరించారు. నాయి బ్రాహ్మణులు, నాదస్వరం, డోలు విద్వాంసులు హాజరౌతారని ఈ సందర్భంగా శోభా యాత్రను నిర్వహిస్తామన్నారు. తరువాత కచ్చేరి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమాలకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎస్ మాధవ్, టిటిడి ఛైర్మెన్ బి.రాజగోపాల్‌నాయుడు, తిరుపతి శాసనసభ్యుడు ఆరణి శ్రీనివాసులు తదితరులు హాజరౌతారని నాయి బ్రాహ్మణ సమాజం హాజరు కావాలని కోలా ఆనంద్ కోరారు.

## పేదలకు అన్నదానం



**తొట్టంబేడు, అక్టోబర్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని ఆర్‌టిసి బస్టాండు వద్దగురువారం డొక్కాసీతమ్మ స్ఫూర్తితో జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ చొరవతో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. జనసేన నాయకులు మాట్లాడుతూ డొక్కాసీతమ్మ స్ఫూర్తిని అమలు చేస్తున్నామన్నారు. ఈ మేరకు తొట్టంబేడులోని జనసేన నాయకులు పేట బ్రదర్స్ సుమారు 65 వారాలుగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి వారం గురువారం పేదల ఆకలి తీర్చే అవకాశం కల్పించటం పవన్‌కళ్యాణ్ అందించిన అవకాశం అన్నారు. ఈ కార్యక్రమాల్లో పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, ప్రదీప్‌కుమార్, తేజ, మణి, మహేష్, నవీన్, చందు, మునిచంద్ర, రాజా, చందు, వీరమహిళలు బత్తెయ్య, పద్మ తదితరులు సహకరించారు.

## అన్ లైన్లో పొదుపు: నిరుద్యోగులకు కుచ్చుటోపి

**తొట్టంబేడు, అక్టోబర్ 16 ప్రభాతవార్త** డబ్బుసంపాదనకు రక రకాల మార్గాలు. అన్‌లైన్లో పొదుపు పేర నిరుద్యోగులకు కొందరు కుచ్చుటోపి పెడుతున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని ధర్మరాజుల గుడి వద్ద ట్రాజీఇండియా పేరుతో ఓ కార్యాలయం ఏర్పాటు చేసి వ్యాపార లావాదేవిలు ప్రారంభమయ్యాయి. ఈ వ్యాపార లావాదేవిలను పరిశీలిస్తే ఒక్కొక్క వ్యక్తి దగ్గర రూ.13వేలు కట్టించుకుంటారు. ఇలా ప్రమోట్ చేస్తే ఇక్కడ పని చేసే ఉద్యోగులకు నెలకు రూ.25వేలు జీతం ఇస్తామంటూ నమ్మబలికినట్లు సమాచారం. ఉద్యోగులుగా చేరిన వారు ప్రమోట్ చేయాలి. వారి నుంచి ముందుగానే రూ.13వేలు వసూలు చేసి జమ చేస్తారు. ఇక్కడ జీతంపై ఆశతో చేరిన వారు నెలలు గడుస్తున్నా ఉద్యోగులకు జీతం ఇవ్వకపోగా జీవనోపాధిగా చేరిన వారికి జీతాలు ఇవ్వక పోగా దాడులకు దిగుతున్నారని వాపోతున్నారు. కడప, కర్నూల్, అనంతపురం ప్రాంతాల నుంచి వచ్చిన వారు మోసపోతున్నామని నిరుద్యోగులు లబోదిబో అంటున్నారు. అయితే అలాంటిది ఏమి లేదని టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి వివరణ ఇచ్చారు.

## శ్రీకాళహస్తిలోని పాఠశాలలను పరిశీలించిన డైట్



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని పలు పాఠశాలలను కార్వేటినగరం డైట్ సీనియర్ లెక్చరర్ ఏ.హేమలత పరిశీలించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బిపి అగ్రహారంలోని మున్సిపల్ మోడల్ ప్రైమరీ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని ఉపాధ్యాయులను హ్యాండ్‌బుక్స్, అసెస్మెంట్‌బుక్స్, విద్యార్థుల ప్రగతి, హోలిస్టిక్స్ కార్డు, స్టూడెంట్ అటెండెన్స్ విద్యాప్రవేశ్, రీడింగ్ అండ్ రైటింగ్ ఎబిలిటి, ఎఫ్‌ఎల్‌ఎన్ టీచింగ్ అండ్ రైటింగ్ లెవల్ అమలు తీరును పరిశీలించారు. శ్రీకాళహస్తిలో విద్య విధానాలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, నౌజియా,, సిఆర్ఎంటి మునిమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలు విరివిగా ఆటల పోటీలకు తర్ఫీదు పొందాలి



**తిరుపతి విద్య, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినిలు ఎస్ వి యు లో అంతర్ కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలలో ఓవరాల్ ఛాంపియన్షిప్ ను సాధించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపల్ డా. తిరుమల నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థినిలు ఓవరాల్ ఛాంపియన్ షిప్ ను సాధించడం కళాశాలకు గర్వకారణం అన్నారు. బాస్కెట్ బాల్, కోకో, టేబుల్ టెన్నిస్ (సింగిల్స్ అండ్ డబుల్స్), టెన్ని కాయిట్ పోటీలలో విన్నర్లు గాను, బాల్ బ్యాడ్మింటన్ (సింగిల్స్ అండ్ డబుల్స్), కబడ్డీ, చెస్ పోటీలలో రన్నర్లు గాను, విద్యార్థినిలు విజేతలుగా నిలిచారన్నారు. విద్యార్థినిలు ఈ విధంగా పోటీలలో పాల్గొనడం వలన పోటీతత్వం, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. గెలుపు, ఓటములను సమభావంతో చూసే గొప్ప భావాలను ఆటల ద్వారా విద్యార్థినిలు అభ్యసిస్తారన్నారు. విద్యార్థినిలు విరివిగా ఆటల పోటీలకు తర్ఫీదు పొంది విజేతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డా. భారతి మాట్లాడుతూ విద్యార్థినిలు ఆటల పోటీలలో పాల్గొనడం వలన శారీరిక, మానసిక ఆరోగ్యం చేకూరుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగాధిపతి డా. భద్రమణి, డా. భువనేశ్వరి దేవి, పద్మశ్రీ, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



చంద్రగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: టిప్పర్ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన దుర్ఘటన గురువారం వేకువజామున మల్లయ్యపల్లి సమీపంలో చోటుచేసుకున్నది. మండల పరిధిలోని మల్లయ్యపల్లి సమీపంలోని ఓ క్వారికి చెందిన టిప్పర్ అదే క్వారీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కరణం శేషగిరిరావు (28) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన శేషగిరిని తిరుపతి రుయాకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మన చేతుల్లోనే మన ఆరోగ్యం: విద్యాశాఖ అధికారి



**సత్యవేడు, అక్టోబరు 16 ప్రభాతవార్త:** సత్యవేడు మండలంలో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని సంపూర్ణ ఆరోగ్యం కోసం చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని ఎంఈవో రవి అన్నారు. సత్యవేడు మండలంలోని ఎంపీఎస్ పాఠశాలలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, యాంకర్ పానాసోనిక్ ఆర్థిక సహకారంతో గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే ఈవెంట్ ను నిర్వహించారు. ఎంఈవో రవి, కిరణ్ కలసి హ్యాండ్‌వాష్ పోస్టర్‌ని విడుదల చేశారు. అనంతరం సత్యవేడులోని 11 పాఠశాలల విద్యార్థుల కోసం డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రవి మాట్లాడుతూ చేతులు శుభ్రంగా లేకపోతే దానికి ఉండే క్రిములు, బాక్టీరియా, వైరస్‌లు మనం తీసుకునే ఆహారం ద్వారా మన శరీరంలోకి వెళ్ళడం జరుగుతుందని, తద్వారా తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా పానాసోనిక్ హెచ్ఆర్ కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు భోజనానికి ముందు, ప్రతి సారి ఎలా చేతులు శుభ్రం చేసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించాలని, రోజు దినచర్యగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణీలు, బాలింతలు చక్కెర, నూనె వినియోగంపై అవగాహన



**విజయపురం, అక్టోబరు 16 ప్రభాతవార్త:** గర్భిణీలు, బాలింతలు చక్కెర వినియోగంపై సీడీపీవో ఇందిర ప్రియదర్శిణి అవగాహన కల్పించారు. మండల కేంద్రమైన విజయపురం మండల పరిషత్ కార్యాల యంలో గర్భిణీలకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0–3 సంవత్సరాల పిల్లలు తీసుకోవలసిన పోషకాహారం గురించి వివరించారు. వెయ్యి రోజుల్లో మెదడు చురుగ్గా అభివృద్ధి చెందుతుందని, వారికి కథలు, బొమ్మలతో ఉత్తేజపరచాలని సూచించారు. రక్తహీనత, ఊభకాయంపై ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది రఘు, ఎంఎల్‌హెచ్‌పీ చందన, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మి, శ్యామల, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మందుబాబుల గుంపులతో విద్యార్థులకు పలు ఇబ్బందులు

**పుత్తూరు రూరల్, అక్టోబరు 16 ప్రభాతవార్త:** పుత్తూరు–తిరుపతి హైవే సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతి రోజు సాయంత్రం ఆర్టీసీ బస్సులో తిరిగి తమ ఇళ్ళకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో పిళ్లారిపట్టు జంక్షన్ వద్ద రోజు మందుబాబులు గుమికూడి ఉండడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం 5 గంటల సమయంలో విద్యార్థులను తీసుకెళుతున్న ఆర్టీసీ బస్సు వద్ద లారీ ఒక్కసారిగా దూసుకొచ్చింది. అదృష్టవశాత్తు లారీ డ్రైవర్ పక్కకు వాలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతంలో మందు బాబులు గుంపులు రోజువారిగా గుమికూడుతుండడం వలన బస్సు రాకపోకలు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

## శ్రీరామలో జూడో క్రీడాకారుల ఎంపికలు



**తిరుపతి విద్య అక్టోబర్ 16 ప్రభాత వార్త:** స్థానిక కరకంబాడి రోడ్‌లో ఉన్న శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ ఫిసికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, జె.ఎన్. టి.యు స్పోర్ట్స్ కౌన్సిల్ వారు అంతర్ జిల్లాల జూడో క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జె.ఎన్. టి.యు అనంతపురం పరిధి లోని వివిధ కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొని జూడో క్రీడలో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ ఎంపికలు నిర్వహించడానికి గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజ్ కి చెందిన జి.రవిచంద్ర ముఖ్య నిర్ణేత గా తిరుపతి, అనంతపూర్ సాప్ ప్రతినిధులు గోపి, అలీ విచ్చేసి క్రీడాకారులకు జూడో పోటీలు నిర్వహించి వారిలో నుంచి ఉత్తమ ప్రదర్శన చేసిన క్రీడాకారులను ఎంపిక చేసారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల చైర్మన్ మన్నెం.రామిరెడ్డి మాట్లాడుతూ ఈ ఎంపికలు మా కాలేజ్ లో నిర్వహించినందుకు జె.ఎన్.టి.యు వారికి, సాప్ వారికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎంపిక అయిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం.రామ సుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం.అరవిందుకుమార్ రెడ్డి ,ప్రిన్సిపాల్ డా.కె.జయచంద్ర, ఫిసికల్ డైరెక్టర్స్ పి.వినోద్ కుమార్, కె.లక్ష్మి సౌజన్య క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఈ పంట నమోదు తప్పక చేసుకోవాలి

**వడమాలపేట, అక్టోబరు 16 ప్రభాతవార్త:** ఈ పంట నమోదు సాగు చేస్తున్న ప్రతి రైతు తప్పని సరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి విజయకుమార్ తెలిపారు. రైతు సాగు చేస్తున్న ప్రతి పంటను విధిగాగ్రామ స్థాయిలో ఉన్న రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలు, వ్యావసయ శాఖ రూపొందించిన ఈ పంట యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. తద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా, పంట నష్ట పరిహారం, పంటలకు గిట్టుబాటు ధరలు, సున్నా వడ్డీ పంట రుణాలు, కౌలు రైతులకు రుణాలు వంటి పథకాలకు రైతులు అర్హులవుతారని తెలిపారు. ఇప్పటికి మండలంలో 8250 ఎకరాల మేరకు వివిధ పంటలు సాగులో ఉందని తెలిపారు. నెలాఖరు లోగా ఈ పంట నమోదు చేసుకోవాలని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నూతన ఎస్‌వి వియు అధికారులకు ఘన సన్మానం

**తిరుపతి విద్య, అక్టోబర్ 16 ప్రభాత వార్త:** పశువైద్య కళాశాలలో నూతనంగా ఎంపిక కాబడిన డీన్ డాక్టర్ ఆర్ వి సురేష్ కుమార్, సి ఓ ఈ డాక్టర్ ఆదిలక్ష్మమ్మ, డీఎస్సీ డాక్టర్ వైకుంతరావు లను పశు వైద్య కళాశాల టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం వారికి పండ్లు, పుష్పగుచ్చం ఇచ్చి దుశ్యాలవాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ రాంబాబు నాయక్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వినోద్ కుమార్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ లక్ష్మి కవిత, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ సుష్మ, డాక్టర్ కుట్టి కుమార్, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గొట్టిగింటి చెరువుకు కాలువ పనులు ప్రారంభం



**భాకరాపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని చెరువుకు వచ్చే కాలువలు జాతీయ రహదారి పనులవలన పూర్తిగా మూసుకొని పోయాయి అది గమనించిన వాసుదేవ శర్మ (వాసు స్వామి) మరియు జనసేన నాయకుడు రంపం మురళి టీడీపీ నాయకుడు కొట్టే శివకుమార్, తిప్పిరెడ్డిగారిపల్లి మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, మంగళపెంట రఫీ, శ్రీనివాసులు, వెంకటేష్, శ్రీను తో కలిసి కాలువపనులు ప్రారంభించామని తెలిపారు

## సురుటుపల్లి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉంటా

**కేవీబీ పురం, అక్టోబరు 16 ప్రభాతవార్త:** సురుటుపల్లి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి మరగదాంబిక అమ్మవార్ల అభివృద్ధి సేవే లక్ష్యం నా జీవితాశయమని ఆలయ చైర్మన్ పద్మనాభరాజు పేర్కొన్నారు. బుధవారం కేవీబీ పురం మండలంలోని విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుడే మొదటి ప్రాధాన్యమని ఆ భక్తుడు వచ్చి తరిస్తే ఆలయ అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత పెరుగుతుందని ఆయన తెలిపారు. రాబోవు రోజుల్లో ఆలయ అభివృద్ధి నిత్యం పూజలు చేసి అందరి సహకారంతో ఆలయం పురోభివృద్ధి దిశగా ఆలయం అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ పద్మనాభరాజును విలేకరులు శాలువతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సతీష్‌నాయుడు, పార్టీనాయకులు, కార్యకర్తలు, పాత్రికేయులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా టపాసులు విక్రయించకూడదు

**రేణిగుంట అక్టోబర్ 16 ప్రభాతవార్త** ప్రభుత్వ అనుమతులు లేకుండా టపాసులు విక్రయించరాదని తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న బాణాసంచా దుకాణాలను గురువారం తాహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సందర్శించారు. తాత్కాలికంగా నిర్మిస్తున్న షెడ్యూలను పరిశీలించారు. టపాసులు అమ్మడానికి అనుమతులు తప్పనిసరి అన్నారు. అగ్ని ప్రమాదాలు జరక్కుండా ముందుగా అగ్ని నిరోధక పరికరాలను ఏర్పాటు చేసుకో వాలన్నారు. ముందస్తుగా బకెట్లలో నీళ్లు, ఇసుక సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రేణిగుంట అర్బన్ ఎస్సై నాగరాజు, వీఆర్వో సుబ్రహ్మణ్యం, టపాసుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో కన్నా పూజలు



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త** పత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నాలక్ష్మీనారాయణ తన సహచరులు సుమారు 50 మందితో గురువారం వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. ఆయనకు శ్రీకాళహస్తిలో ఘనస్వాగతం లభించింది. రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారధ్యంలో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఆలయ డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ప్రోటోకాల్ ఎఇఒ మోహన్, పిఆర్‌ఒ రవిలు వేదపండితులచే ప్రత్యేక స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయంలో వద్ద వారికి వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లును పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం పర్యవేక్షించారు.

## పారా మెడికల్ సిబ్బంది దీక్షలకు సంఘీబావం

చంద్రగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: పారా మెడికల్ సిబ్బంది దీక్షలకు సంఘీబావంగా చంద్రగిరి కోలోకేటెడ్ పిహెచ్‌సి మెడికల్ సిబ్బంది భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి తమ సంఘీబావం తెలిపారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ గత నెల 30 నుండి విజయవాడలో పిహెచ్‌సి వైద్యులు దశలవారీగా గ్రామస్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో మొదట విధులు నిర్వహిస్తూ ఆందోళన చేపట్టారు.

# తిరుపతి డివిజన్

## పిల్లలు బరువు, ఎత్తు సక్రమంగా మెరుగు పడటానికి తోడ్పడాలి

**పుత్తూరు రూరల్, అక్టోబరు 16 ప్రభాతవార్త:**

పిల్లలు బరువు, ఎత్తు సక్రమంగా పోషణ స్థితి మెరుగుపడటానికి తోడ్పడాలని సీడీపీవో పేర్కొన్నారు. పుత్తూరు ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన మహిళా, శిశు అభివృద్ధి శాఖ పథక సంచాలకులు వసంతభాయి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు ఎత్తు సక్రమంగా ప్రతినెల పిల్లల పోషణ స్థితి మెరుగు పడటానికి మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ తోడ్పడాలని సూచించారు. తిరుపతి జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల నుంచి సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పుత్తూరు ప్రాజెక్టులోని పుత్తూరు, వడమాలపేట మండలంలోని 129 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి 0–5 సంవత్సరాల పిల్లలకు బరువు ఎత్తు సక్రమంగా ఎలా వేయాలో చేసి చూపించి పిల్లల వారి పోషణ స్థితి తెలియజేశారు. అనంతరం టాటా ట్రస్టు వారి సహకారంతో గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే ప్రాముఖ్యత తెలియజేసి ప్రతి ఒక్కరు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవలసిన ఆవశ్యకత, కచ్చితంగా 20 సెకండ్లు పాటు హ్యాండ్ వాష్ చేసుకోవాల్సిన అవసరాన్నితెలియజేశారు. కార్యక్రమంలో పుత్తూరు ప్రాజెక్టు సీడీపీవో, సూపర్‌వైజర్, బీపీసీ డీఈవో, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## రైతులకు ప్రోత్సాహక నగదు వివరాలు ప్రజాప్రతినిధులకు చెప్పరా..?

**పుత్తూరు రూరల్, అక్టోబరు 16 ప్రభాతవార్త:**




రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, మామిడి రైతులకు టన్నుకు రూ.4 వేలు ప్రోత్సాహక నగదు అందిస్తున్నట్లు వ్యవసాయ అధికారి కోదండయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మునివేలు కలుగచేసుకుని ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజాప్రతినిధులకు చెప్పరా ఏఏ రైతుకు రైతు భరోసా అందించారు జాబితా ఇవ్వాలని ఆమె నిలదీశారు. పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో 500 క్వింటాళ్లు వేరు శనగ విత్తనాలు అందించేందుకు సిద్ధం చేశామని వేరుశనగ విత్తనాలు తీసుకున్న ప్రతి రైతు కూడా తప్పని సరిగా విత్తుకోవాలని ఆయనసూచించారు. ఉద్యానశాఖ అధికారి వెంకట సౌజన్య మాట్లాడుతూ మామిడి మొక్కలు పెంచుకునే రైతులకు ఉచితంగా మొక్కలు అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీదేవి, వైస్ ఎంపీపీ విమలమ్మ, మునస్వామిరెడ్డి, అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## సూపర్ జిఎస్టీ మార్పుతో వినియోగదారులకు మరింత ఆదా :

పుత్తూరు ఎంవిఐ చంద్రశేఖర్



**నారాయణవనం, అక్టోబర్ 16 ప్రభాతవార్త** :కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన సూపర్ జిఎస్టీ పై అవగాహన కార్యక్రమం పుత్తూరు మోటారు వెహికల్ అధికారి చంద్రశేఖర్ గురువారం నిర్వహించారు. మండలకేంద్రంలోని నారాయణవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంవిఐ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్‌తో ప్రజలకు ఎంతో మేలు కలుగు తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త జీఎస్టీ శ్లాబులను ప్రజలందరికి అవగాహన కలిగించాలన్నారు. వాహనాలు, వస్తువుల కొనుగోళ్లపై ఎంత వరకు తగ్గుదల అవుతున్నదో ప్రజలకు తెలియజేయాలన్నారు. అంతకుమందు ఆటో డ్రైవర్లు, టు వీల్, ట్రాక్టర్ డీలర్లు ఎంవిఐని సత్కరించారు.

## నకలీ మద్యం, స్పిరిట్‌లను అరికట్టడమే ప్రభుత్వ లక్ష్యం

: పుత్తూరు ఎక్సైజ్ సిఐ

**నారాయణవనం, అక్టోబర్ 16 :** పుత్తూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పరిధిలో నకిలీ మద్యం తయారీ, స్పిరిట్‌లను అక్రమంగా అమ్మితే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తప్పవని పుత్తూరు ఎక్సైజ్ సిఐ బి మురళీమోహన్, ఎస్ఐ ఆంజాద్‌భాషాలు తెలిపారు. గురువారం నారాయణవనంలో మద్యంసాపు యజమానులతో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నకిలీమద్యం తయారీ, అమ్మకం, స్పిరిట్ అమ్మకం వంటిది జరిగితే చర్యలు తీవ్రంగా వుంటుందన్నారు. పుత్తూరు ఎక్సైజ్‌శాఖ పరిధిలోని పుత్తూరు రామచంద్రాపురం, వడమాలపేట, నారాయణవనం మండలాల్లోని ఎ4 షాప్ లైసెన్స్‌లు మరియు నౌకర్ నామాల స్మార్ట్ ఫోన్‌లలో సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దీంతో మద్యం అమ్మే సమయంలో ఈజీగా కనిపెట్టవచ్చున్నారు. దీన్ని ఉపయోగించుకోవాలన్నారు.

## అండర్-19 జూడోకు వడమాలపేట విద్యార్థులు




**వడమాలపేట, అక్టోబరు 16 ప్రభాతవార్త:** ఉమ్మడి చిత్తూరు జిల్లా జూడో జట్టుకు వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గీతాశ్రీ(9వ తరగతి) 40 కిలోల విభాగంలో, అంజలి(9వ తరగతి) 48 కిలోల విభాగంకు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్ రాజు తెలిపారు. తిరుపతి శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా 14వ తేదీ ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్–19 జూడో ఎంపిక పోటీలు జరిగాయి. గీతాశ్రీ, అంజలిలు ఆయా విభాగాలలో మొదటి స్థానంలో నిలిచారు. దీంతో వీరిని ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. చిత్తూరు జిల్లా స్కూలు గేమ్స్ సెక్రటరీ డా. బాబు ఆధ్వర్యంలో టీమ్‌ను ఎంపిక చేశారు. అక్టోబరు చివరి వారంలో శ్రీ సత్యసాయి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారు. చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న వీరిని ప్రధానోపాధ్యాయులు కరుణ నవనీతం, ఉపాధ్యాయులు అభినందించారు. చక్కగా శిక్షణ తీసుకుని రాష్ట్ర స్థాయి పోటీల్లోరాణించి జాతీయ స్థాయికి ఎంపికవ్వాలని కోరారు.

## కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా తెరణి జయరాంరెడ్డి

**కేవీబీ పురం, అక్టోబరు 16 ప్రభాతవార్త:**

కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా తెరణి జయరాంరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లా కేవీబీ పురం మండలం ఆరె గ్రామానికి చెందిన తెరణి జయరాంరెడ్డి ఇప్పటికే కార్మిక సంఘాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ పేద కూలీల సంక్షేమం కోసం పోరాటం చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం టీఎన్‌టీయూసీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న జయరాంరెడ్డి, ఈ కొత్త పదవితో కార్మిక వర్గాల ఆశయాలను మరింత బలంగా ప్రభుత్వానికి చేరవేయగలరన్న నమ్మకం కార్మిక సంఘాల్లో వ్యక్తమవుతోంది.

## సర్పంచ్ కోటమ్మ చొరవతో కృష్ణాపురం స్కూలుకు మహర్దశ

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 16 ప్రభాతవార్త:**



పీవీ కండ్రిగ పంచాయతీ సర్పంచ్ యనమల కోటమ్మ చొరవతో కృష్ణాపురం ఎస్టీ కాలనీలోని టీ డబ్ల్యుఎస్ స్కూలుకు మహర్దశ నెలకొంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృష్ణాపురం గిరిజన కాలనీలోని టీ డబ్ల్యుఎస్ స్కూలు భవనం చుట్టూ పల్లపు ప్రాంతం ఉండడం వలన చినుకు పడితే వర్షపు నీటితో చిన్నపాటి చెరువుల మారేది దీని వలన విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉండేది. సమస్యను తెలుసుకున్న సర్పంచ్ కోటమ్మ పంచాయతీ నిధులతో పూర్తి స్థాయిలో పల్లపు ప్రాంతాన్ని గ్రావెల్ మట్టితో పూడ్చి చదును చేసి వర్షపునీరు నిలవకుండా పనులు చేపట్టింది. సర్పంచ్ కోటమ్మ చేసిన ఈ అభివృద్ధి పనులు వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## తిరుమలలో శరభయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి



**రేణిగుంట, అక్టోబర్ 16 ప్రభాతవార్త**

తిరుమల నందు శ్రీవారిని తొలిసారి దర్శనం చేసుకున్న గొల్ల శరభయ్య విగ్రహాన్ని, శరభయ్య పేరుతో శరభయ్య మఠం (యాదవ సత్రం) తిరుమలలో నిర్మించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. భూలోకంలో స్వామి అడుగుపెట్టిన తర్వాత తొలిసారి స్వామిని దర్శించుకున్న పురాణ పురుషుడు గొల్ల శరభయ్య అన్నారు. యుగాంతం వరకు శరభయ్య వంశికులే మొట్టమొదట శ్రీవారిని దర్శించుకునే భాగ్యాన్ని సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వర స్వామి కల్పించారని గుర్తు చేశారు. శ్రీవారికి ప్రియ పాత్రుడైన గొల్ల శరభయ్య విగ్రహంతోపాటు, యాదవ్ సత్రం తక్షణం నిర్మించాలని టీటీడీకి విజ్ఞప్తి చేశారు.

## నకిలీ మద్యాన్ని అరికట్టడమే లక్ష్యం : ఎక్సైజ్ సిఐ



పుత్తూరు, అక్టోబరు 16 ప్రభాతవార్త : నకిలీ మద్యాన్ని అరికట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎక్సైజ్ శాఖ పుత్తూరు సిఐ మురళీమోహన్ అన్నారు. అందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 'ఏపి ఎక్సైజ్ సురక్ష' అనే యాప్‌ను రూపొందించిందని తెలిపారు. గురువారం పుత్తూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో పుత్తూరు మునిసిపాలిటీ, నారాయణవనం, వడమాలపేట, రామచంద్రాపురం మండలాల్లోని మద్యం లైసెన్స్ దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్‌ను వినియోగించడం వల్ల నకిలీ మద్యం, పన్ను చెల్లించని మద్యం బాటిళ్లను సులువుగా గుర్తించవచ్చున్నారు. కొనుగోలుదారులు కూడా ఈ యాప్‌ను వినియోగించి షాపుల్లో విక్రయిస్తున్న మద్యం అసలా, నకిలీయా అని తెలుసుకోవచ్చని తెలిపారు.

# సాగరమాల రహదారి అండర్‌పాస్ బ్రిడ్జి మంజూరు చేయాలి



చిల్లకూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: ఉడతావారిపల్లి-పార్లపల్లి దగ్గర సాగరమాల రహదారి అండర్ పాస్ బ్రిడ్జి మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు చిల్లకూరు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి విన్నవించారు. గురువారం చిల్లకూరు మండలంలో పర్యటుస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వ ర్లుని మండల టిడిపి అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. తిక్కవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు తల్లికి వందనం పథకం మొత్తం 302 మంది విద్యార్థులకు అకౌంట్‌లో డబ్బులు జమ కాలేదని కలెక్టర్‌కి విజ్ఞప్తి చేయగా, తక్షణమే స్పందించి జనవరి లోపు అందించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెనుబోలు జానకిరామిరెడ్డి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు నెలటూరు సుప్రజ, బిసి సెల్ అధ్యక్షులు మేకల కుమార్, ముత్యాలమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యులు మునిశేఖర్, భూదనం పిఏసిఎస్ చైర్ పర్సన్ ప్రవీణ్ రెడ్డి, నాయకులు గంగాధర్ రెడ్డి, చంద్రారెడ్డిరెడ్డి మురళిరెడ్డి, పేరెంట్స్ మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కోసం చిరుధాన్యాల ఆహారం తీసుకోవాలి



వెంకటగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త : ఆరోగ్యం కోసం చిరుధాన్యాల తయారీతో చేసిన పలహారాలు జనాలని చూసినాను కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం ఆధ్వర్యంలో పట్టణంలోని మందరిల్లు అంగన్వాడి కేంద్రంలో స్వయం సహాయ సంఘాల మహిళలకు ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా శిక్షణా కార్యక్రమం, చిరుధాన్యాలు, మునగ ఆకు పొడితో. వేరుసెనగ చిక్కి తయారిపై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించటం జరిగింది. చిరుధాన్యాలు, మునగ ఆకు పొడితో వేరుసెనగ చిక్కి చిరుధాన్యాల తో వేరుసెనగ చిక్కి, వేరుసెనగ చిక్కి ప్రదర్శంచారు. వాటిలో చిరుధాన్యాలు మరియు మునగ ఆకు పొడితో వేరుసెనగ చిక్కికి ఎక్కువ ఆమోదం లభించింది. ఆహార భద్రత, పోషకాహారం కోసం స్థిరమైన ఆహార వ్యవస్థలు" ఏర్పాటు చేయటంపై ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుంది. దానిలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం గృహ విజ్ఞాన శస్త్ర విభాగం ద్వారా క్షేత్ర స్థాయి పరిశీలనలు, ప్రదమ శ్రేణి ప్రదర్శ నలు, పోషకాహారంకు సంబంధించి వివిధ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

## పరిసరాలు పరిశుభ్రంతోనే...
## ఆరోగ్యంగా ఉంటారు : ఎంపీడీవో



వెంకటగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలాల్లోని పూలరంగడుపల్లి గ్రామంలో గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై సూచనలు సలహాలు ఇచ్చారు. వీధుల్లో చెత్తాచెదారని సూచించారు. తడి పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బంది ఇవ్వాలని తెలిపారు.

## పార్టీ కార్యకర్తలు నాయకులకు అండగా ఉంటాం : నేదురుమల్లి



వెంకటగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటానని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జంగాలపల్లి గ్రామానికి చెందినవైసిపి వైసిపి నేత మనోహర్ ఇటీవల మృతిచెందనాలతో చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మనోహర్ కుటుంబ సభ్యులను పరామర్శించే ధైర్యం చెప్పారు. తెలుగుదేశం పార్టీ వారు ఇబ్బంది పెట్టారని చెప్పారు.

## మున్సిపల్ విభాగం వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా హరికృష్ణ



వెంకటగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ విభాగం వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా చిట్టేటి హరికృష్ణ నియమిస్తూ పార్టీ కార్యాలయంలో నుండి ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుతమార్ రెడ్డి నాపై ఉన్న నమ్మకంతో ఈ పదవి ఇప్పించాలని హరికృష్ణ తెలిపారు. పార్టీ పటిష్టతకు తలవత్తు కృషి చేస్తానని తెలిపారు.

## వైకాపా నేతకు ఎమ్మెల్సీ సన్మానం



వాకాడు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: మాజీ ఎంపీపీ, కొడవలూరు దామోదర్ రెడ్డికి వైసిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులు కావడంతో ఎమ్మెల్సీ మేరిగా మురళీధర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. గురువారం వాకాడు నేదురుమల్లి కళాక్షేత్రం ఆవరణంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురళీధర్ మాట్లాడుతూ నిత్యం పార్టీ కోసం కష్టపడిన దామోదర్ రెడ్డిని గుర్తించి పదవి రావడంతో అభినందనలు తెలుపుతున్నాను అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు జగన్మోహన్‌రెడ్డి ఇస్తున్నార న్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ వాకాటి జనార్దన్‌రెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, గూడూరుసుధాకర్‌రెడ్డి, రాజారామ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## స్వర్గీయ ఎన్‌బికెఆర్‌కు ఘన నివాళులు



వాకాడు, అక్టోబర్ 16 ప్రభాతవార్త : ఎన్.బి.కె.ఆర్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు స్వర్గీయ పద్మశ్రీ దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సమాధి వద్ద ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ గురువారం ఘనంగా శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం, విద్యాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ప్రపంచంలోని అనేక దేశాలలో వాకాడులో చదివిన విద్యార్థులు అత్యున్నత స్థాయిలో ఉన్నారన్నారు, ఆయన వెంట వైకాపా ఎస్‌ఈసి సభ్యుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

# యువతే మన దేశ సంపద : వీసీ నరసింగరావు



తిరుపతి విద్య, అక్టోబర్ 16 ప్రభాతవార్త: యువతే మన దేశానికి నిజమైన సంపదని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తాతా నరసింగరావు అన్నారు. యస్వీయూలోని స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే యువ తరంగ్ 2025 కార్యక్రమం గురువారం ప్రారంభ మైంది. శ్రీనివాసా ఆడిటోరియంలో జరిగిన ప్రారంభోత్సవంలో వీసీ ఆచార్య నరసింగరావు మాట్లాడుతూ మానవ జీవితానికి కళలు, సాహిత్యం వంటివి అవసరమని,అవి మనిషిని ఆదర్శంగా మారుస్తాయని అభిప్రాయపడ్డారు. మన సంస్కృతి సంప్రదాయాలకు కళలు ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. తనకు వ్యక్తిగతంగా కళలు, సంగీతం పట్ల ఆసక్తి ఉన్నా,సాధన చేయడం సాధ్యం కాలేదని తెలిపారు.అయితే,వీలైన మేరకు సంగీతాన్ని నేర్చుకున్నానని చెప్పారు.క్రీడా,సాంస్క ృతిక రంగాల్లో యూనివర్సిటీ మంచి గుర్తింపును సంతరించుకోవడం శుభపరిణామం అని తెలిపారు. శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా సాంస్కృతిక అభివృద్ధికి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. తాను యూనివర్సిటీలో చదువుకునే సమయంలో యూత్ ఫెస్టివల్ ఎంతో ఆనందాన్ని ఇచ్చేదన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ యువతరంగ్ 2025 ఎంతో ఉత్సాహంగా ప్రారంభమైందని తెలిపారు.ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సాంస్కృతిక అంశాల పట్ల ఆసక్తి పెరిగి,సమాజంలో సమైక్యత వృద్ధి చెందుతుందని తెలిపారు. కళలు మనిషి మానసిక వికాసానికి దోహదం చేస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రముఖ సినీ నటుడు కిరణ్ అబ్బవరం సందడి చేశారు. యువతరంగ్ 2025 ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో ఎంతో ఉత్తేజం పొందానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డెవలప్ మెంట్ కౌన్సిల్,డీన్ ఆచార్య చెంద్రాయుడు, ఆర్ట్స్, కామర్స్, ఇంజనీరింగ్ ప్రిన్సిపాళ్ళు సుధారాణి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ఆచార్య బి వి మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ కళ్యాణ్,డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్, ప్రసన్న, స్వరూప్, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ ప్రాంతాల కళాకారులు పాల్గొన్నారు. కాగా ఉదయం 9.30 గంటలకు యువతరంగ్ 2025 ప్రారంభ సూచికగా యూనివర్సిటీలో భారీర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య భవన్ నుంచి శ్రీనివాసా ఆడిటోరియం దాకా కళాబృందాలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. వివిధ రకాల వేషధారణలతో కళా ప్రదర్శనలతో కళాకారులు అందరినీ ఆకట్టుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి యువతరంగ్ 2025 కు వచ్చిన కళాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రదర్శనలను న్యాయ నిర్ణేతలు పరిశీలించారు. విజేతలకు ముగింపు సభలో బహుమతులు ప్రదానం చేస్తారు.

## అమ్మవారి సేవలో టీటీడి ఎల్‌ఎసి చైర్మన్



తిరుచానూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని తెలంగాణ హిమాయత్‌నగర్ టీటీడీ ఎల్‌ఎసి చైర్మన్ నేమూరి శంకర్ గౌడ్ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనను స్వాగతించి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్థంబాన్ని నమస్కరించి అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత ఆశీర్వాద మండపం వద్ద ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అంతక ముందుగా తిరుపతి జనసేన టౌన్ సెక్రటరీ, 44వ వార్డు జనసేన అధ్యక్షుడు సాయి దేవ్ యాదవ్ ఘనంగా స్వాగతం పలికి దుస్సలవాతో సన్మానించి పుష్ప గుచ్ఛాని అందించారు.

## వాహనం కంటే ప్రాణాలు ముఖ్యంగా భావించాలి

**- ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం, అక్టోబర్ 16 ప్రభాతవార్త: ప్రజలు వాహనాల కంటే తమ ప్రాణాలు ముఖ్యంగా భావించాలని ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ కంచర్ల శ్రీకాంత్ కోరారు. గురువారం పలమనేరు ఆర్డీఓ మధుసూధన్ నేతృత్వంలో పట్టణంలోని ఆటోమొబైల్ డీలర్లు, వాహనాల డీలర్లు పట్టణంలో సూపర్ జిఎస్టీ, హెల్మెట్ అవగాహనర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వ విప్ కంచర్ల మాట్లాడుతూ టువీలర్లకు లక్ష రూపాయల దాకా పెట్టి కొనుగోలు చేసేప్రజలు వెయ్యి రూపాయల ధర కూడా లేని హెల్మెట్‌ను మాత్రం కొని ధరించడం లేదన్నారు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలకుగురై ఇరవైనుంచి ముప్పై లక్షల దాకా ఆస్పత్రులకు ఖర్చుచేస్తున్నారన్నారు. ఇది బాధాకరమన్నారు. వాహనం నడిపేసమయంలో తప్పకహెల్మెట్ ధరించి నడపాలని సూచించారు. ముఖ్యంగా యువత ఈవిషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ప్రధాని మోడీ ప్రకటించిన సూపర్ జిఎస్టీతో పేదలకు ఎంతో లబ్ది కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, సోమశేఖర్, ఎంఆర్‌సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్,కో ఇన్‌చార్జ్‌లు శ్యాం సుందర్, తిరుమగళ్, రెస్కో డైరెక్టర్ శివ, కెపిఎస్ కార్యదర్శి టిసి వె ంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

## మండల మీట్‌లో ప్రోటోకాల్ ఉల్లంగన రగడ!

**సర్పంచుల తీర్మానం లేకుండా పనులా-అధికారులను నిలదీసిన జడ్పీటీసీ**



నారాయణవనం, అక్టోబర్ 16 ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఎంపిపి పి.దివాకర్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ప్రోటోకాల్‌పై గరంగరంగా మీటి ంగ్ సాగింది. ముందుగా జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ మాట్లాడుతూ ప్రోటోకాల్ పాటించకుండానే జరిగిన అభివృద్ధి పనులను ప్రారంభించడం, శిలాఫలకాలు ఏర్పాటు చేయడం ఫీల్డ్ అసిస్టెంట్లను ఎలా నియమిస్తారని సంబందిత పంచాయతీరాజ్, గ్రామీణా ఉపాధిహామి పథకం అధికారులను నిలదీశారు. ఎంపిపికి, ఎంఎల్ఎ, జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపిటిసిలకు తెలియకుండా దొంగతనంగా ఎలా చేస్తారన్నారు. అభివృద్ధి కోసం ఉన్నత అధికారుల దగ్గర నిధులు తాము తీసుకురావాలి, పనులు పూర్తి చేసిన ఎవ్వరికి సమాచారం లేకుండా ప్రారంభిస్తారా అని మండిపడ్డారు. ఒక్క సింగిరికోన రోడ్డుకు పంచాయతీ తీర్మనం ప్రకారం సుమారు 4.90 కోట్ల నిధుల మంజూరు కోసం తీర్మనం ఇస్తే దాన్ని సర్పంచుకే తెలియకుండా 6.92కోట్లకు బిల్లులు ఎలా పెడతారన్నారు.సముదాయం, కీళగరం, వెత్తలతడుకు, సముదాయం, బొప్ప రాజుపాలెం పంచాయతీలకు పంచాయతీ తీర్మానం లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్లను ఎలా నియమిస్తారన్నారు. దీనిపై త్వరలో ఆందోళన తప్పదన్నారు. ఎంపిపి దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో విద్యుత్ స్తంబాలను ఏర్పాటు చేయడంతో పాటు క్లాంపులను కూడా ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయం కరెంట్ సిద్దంగా తప్పక ప్రతిరోజు అందుబాటులో వుండాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి శివశంకర్, సింగిల్‌విండో ఛైర్మన్ షణ్ముగం, ఎంపిడిఓ అరుణ, తహశీల్దారు రోజారాణి, ఇఓపిఆర్‌డి వేణయ్య, ఇఓ టిపి షణ్ముగం, ఎంఇఓలు కోదండనాయుడు, జనార్ధన్‌రాజు, ఎఓ శోభారాణి, డాక్టర్ లక్ష్మీ పార్వతి, ఎఇఇలు తరుణ్, ఈశ్వర్, ఎపిఓ సుఖన్య, ఎపిఎం ధనంజయరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆరు మంది రెవెన్యూ సిబ్బంది సస్పెండ్ : జిల్లా కలెక్టర్

సత్యవేడు, అక్టోబరు 16 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా సత్యవేడు మండలం వా నెల్లూరు ఫారెస్టు భూములకు సంబంధించి వెబ్లాండు అక్రమ నమోదులో స్థానిక రెవెన్యూ అధికారులు 6 మందిపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో ఇన్‌చార్జి ఆర్ఐ సురేష్,వా నెల్లూరు వీఆర్‌వో రాఘవేంద్ర, గ్రామ సర్వేయర్ వెంకటేష్, కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, కన్నవరం పూర్వపు సచివాలయ వీఆర్‌వో భార్గవ్, సత్యవేడు పట్టణంలోని సచివాలయ పూర్వపు సిబ్బంది పూర్ణ చందునాయుడు ఉన్నట్లు స్థానిక తహసీల్దార్ రాజశేఖర్ పేర్కొన్నారు. వా నెల్లూరు గ్రామంలో 197/1లో 252.16 ఎకరాల ఫారెస్టు భూములు సంబంధించి వెబ్లాండ్ భూమాయాజాలంపై ఇటీవల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వీరిపై కేసులు నమోదు చేయడంతో పరిపాలన సౌలభ్యంలో భాగంగా జిల్లా అధికారులు వీరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. దీంతో పాటు అప్పటి తహసీల్దార్ రామాంజనేయులు కూడా సస్పెన్షన్‌కు గురైనట్టు సమాచారం. ఇప్పటికే ఈ భూ మాయాజాలంపై స్థానిక పోలీసు అధికారులు విచారణ ప్రక్రియ కొనసాగుతోంది.

## డానియెలి ఇండియా పరిశ్రమకు...4 గోల్డ్, ఒక సిల్వర్ అవార్డులు




సత్యవేడు, అక్టోబరు 16 ప్రభాతవార్త: క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ నిర్వహించిన చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్(సీసీక్యూసీ) పోటీల లో అత్యున్నత నాణ్యత పని తీరుకు గాను శ్రీసిటీలోని డానియెలి ఇండియా ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ నాలుగు గోల్డ్ అవార్డులు, ఒక సిల్వర్ అవార్డును గెలుచుకుంది. దీంతో పాటు విశిష్ట నాయకత్వ ప్రతిభకు గాను డానియెలి కంపెనీ చీఫ్‌ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) పి.శ్రీనివాసరావుకు ట్రాన్స్‌ఫార్మేషనల్ లీడర్‌షిప్ అవార్డు ప్రదానం చేశారు. ఆయన సామర్థ్యం దార్శినికత, పటిష్టనాయకత్వ లక్షణాలకు గాను అవార్డు దక్కింది. ఇది శ్రీసిటీకి గర్వకారణమని వ్యాఖ్యనించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, డానియెలి యాజ మాన్యం, సిబ్బందికి అభినందనలు తెలిపారు. మంచి నాయకత్వాన్ని పెంపొందిస్తున్న శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థకు ఇది అద్దం పడుతోందన్నారు. ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత డానియెలి గ్రూప్‌కు చెందిన శ్రీసిటీలోని డానియెలి ఇండియా కంపెనీ అధిక నాణ్యతతో కూడిందన్నారు.

## అవిలాల చెరువు పునరుద్దరణకు చర్యలు : తుడా చైర్మెన్



తిరుపతిరూరల్, అక్టోబర్16 ప్రభాతవార్త: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటి) మార్గదర్శకాల మేరకు అవిలాల చెఱువు పనులు చేపడతామని తుడ చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం తుడా చైర్మెన్, అధికారులతో కలిసి అవిలాల చెఱువును పరిశీలించారు. తిరుపతి పరిసర ప్రాం తాలకు ముఖ్యమైన నీటి వనరుగా ఉన్నందున చెఱువులో నీటి నిల్వ సామర్థ్యం ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో విధానాలపై అధికారులతో తుడ చైర్మెన్ చర్చించారు. చెఱువుకు వచ్చే వర్షపునీటి మార్గాలను, ఔట్ ఫ్లో వ్యవస్థను, చెఱువు చుట్టూ జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులకు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అవిలాల చెరువుకు పూర్వవైభవం తీసుకురావటానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, తుడా కార్యదర్శి, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

## నీవా నది వరద బాధితులకు అండగా వుంటాం

**- కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు**

చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: చిత్తూరు నీవా నది వరద బాధితులకు అండగా నిలుస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి గురువారం నీవా నది పరివాహక ప్రాంతాలైన తోటపాళ్యం ఏటివార, దోభీఘాట్, వీరభద్రకాలనీ, తేనబండ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. అలాగే సంతపేట లిల్లీబ్రిడ్జి దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. నీవా నదికి వరదలు వచ్చినా పరివాహన ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. సతపేట విజయలక్ష్మీ కాలనీ నుండి రోడ్డు సౌకర్యం కల్పించి, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యేలు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వీరభద్రకాలనీలో దెబ్బతిన్న కల్వర్టును వరద నీటికి దాటి వెళ్ళి పరిశీలించారు.

# గూడూరు డివిజన్

## ఔట్ సోర్సింగ్ కార్మికులకు చట్టాలను అమలు చేయాలి



గూడూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు, చట్టాలు సరిగా అమలు చేయాలని, ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్ సి.ఐ.టి.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తులసీరామ్ తెలియజేశారు. చట్టాలు అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోలలో పర్యటనలో భాగంగా గురువారం రోజు గూడూరు ఆర్టీసీ డిపోకి చేరుకోవడం జరిగింది. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను కలసి వారి పనివిధానం, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసి ఎస్.డబ్ల్యూ.ఎఫ్ మరియు సి.ఐ.టి.యు పట్టణ నాయకులతో కలిసి గూడూరు డిపో మేనేజరు పి.సి.హెచ్.లక్ష్మిని కలసి డిపోలో పనిచేస్తున్న స్వీపింగ్, వాషింగ్, వివిధ రకాల పనులు చేస్తున్న కార్మికులకు వేతనాలు కాంట్రాక్టర్ ద్వారా సరిగా అన్నదే విధంగా చూడాలని ఔట్ సోర్సింగ్ కార్మికులకు హక్కులు, పనిగంటలు కార్మిక చట్టాలు, అమలు చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్.డబ్ల్యూ.ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు డి. మల్లికార్జున, జిల్లా సహాయ కార్యదర్శి కె.ఎస్.వాసులు, గూడూరు డిపో అధ్యక్షులు రఘు రామయ్య, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య కార్మికులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ



చిల్లకూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: మండల పరిధిలోని పాలిచెర్లవారి పాలెం ఉన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. గూడూరుకు చెందిన పోలీసు కానిస్టేబుల్ శనగ మస్తానయ్య దాతృత్వంతో మెటీరియల్‌ను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనసూయ మాట్లాడుతూ దాతలు ఇచ్చిన సహకారంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాత మస్తానయ్య మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మాధవయ్య, శ్రీనివాసులు, ప్రజేంద్ర రెడ్డి, సుగుణ, నాగభూషణమ్మ, మధుసూదనరావు, విద్యుల్లత, కామేశ్వరి, రవీంద్ర లతోపాట విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వృద్ధుడు మృతి!

చిల్లకూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో శ్రీముత్యాలమ్మ గుడి వద్ద చోటు చేసుకుంది. శ్రీ ముత్యాలమ్మ గుడి వద్ద బిక్షాటన చేస్తూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతి చెందిన వృద్ధుడు ఎడమ చేతి పై టి. వెంకటరమణ అని పచ్చబొట్టు ఉంది. అందువల్ల ఈ వృద్ధుడు ఆచూకి తెలిసిన వారు చిల్లకూరు ఎస్ఐకి 9440796347 నెంబర్‌కు తెలపాలని తెలిపారు.

## అద్వైత వేదాంత విద్యార్థికి సత్కారం



తిరుపతి విద్య, అక్టోబర్ 16 ప్రభాతవార్త: అద్వైత వేదాంత విభాగ విద్యార్థి వరదరాజన్ శర్మకు శ్రీ కాంచి కామకోటి పీఠం,కాంచీ వేద వేదాంత శాస్త్ర సభ ద్వారా అద్వైత వేదాంత రత్న బిరుదు పొందిన శుభ సందర్భంగా గురు వారం అద్వైత వేదాంత విభాగం అధ్యా పకులు, వర్సిటీ వైస్‌ఛాన్సర్ ప్రొ.జి. యస్. ఆర్ కృష్ణమూర్తి సన్మానించారు.ఈ సందర్భ ంగా విసి కృష్ణమూర్తి మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పరమాచార్య గురుకుల కేంద్ర విద్యార్థి వరదరాజన్ శర్మకు శ్రీకాంచీవేదవేదాంతశాస్త్రసభ ద్వారా అద్వైత వేదాంత శాస్త్రంలో అద్వైత వేదాంత రత్న అనే బిరుదు పొందడం వర్సిటి కి ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం అద్వైత వేదాంత శాస్త్రంలో వర్సిటీ విద్యార్థులచే శాస్త్రార్థ గోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ పరమాచార్య గురుకుల కేంద్ర డైరెక్టర్ ప్రొ.కె.గణపతి భట్, ఐ.క్యూ.ఎ.సి డైరెక్టర్ ప్రొ.సతీష.కె.ఎస్, అద్వైత వేదాంత శాస్త్ర బోధకులు బ్రహ్మశ్రీ శ్రీహరి శివరామ దాయగుడే, డా. నాగరాజ్ భట్, డా.మనోజ్ షిండే వేదాంత విభాగ ఆచార్యులు, విద్యార్థులు వరదరాజన్‌కు అభినందనలు తెలిపారు.

## నీ శ్లోకం కనిపించడం లేదు... కైలాసవాసీ!



శ్రీకాళహస్తి,అక్టోబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రధాన ప్రవేశమైన భిక్షాల గోపురానికి వున్న కైలాసవాసీ భగవాన్ శ్రీకాళహస్తీశ్వరశ్శివః కరోతు నిత్య కళ్యాణం కరుణా వరుణాలయః అనే శ్లోకంతో వున్న ఫ్లెక్సీ బోర్డు గత కొన్ని సంవత్సరాలుగా మసకబారి పోయింది. శిథిలావస్థకు చేరినా, మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా కూడా ఈ బోర్డును పునరుద్దరించలేదు. శ్రీకాళహస్తీశ్వరునికి అత్యంత పవిత్రమైన ఈ శ్లోకం రోజువారీ భక్తులు, ఆలయంలో దర్శనానికి రాలేని భక్తులు, బయటనుంచే శ్రీకాళహస్తీశ్వరుని ప్రార్థిస్తూ ఈ శ్లోకాన్ని పఠించి సంతృప్తి చెందుతారు. అలాంటి శ్లోకం కొత్త స్టిక్టర్‌ను ఏర్పాటు చేయడంలో ఆలయాధికారుల నిర్లక్ష్యాన్ని నిదర్శంగా మారింది. ఈ బోర్డు స్పష్టంగా కనిపించడలేదు, ఇప్పటికైనా ఈ పవిత్రమైన శ్లోకానికి, కొత్త బోర్డు ఏర్పాటు చేయాలని భక్తుల కోరుతున్నారు.

## శ్రీకాళహస్తి ఇఓను కలసిన బోర్డు సభ్యుడు



శ్రీకాళహస్తి,అక్టోబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలిలో నామినేట్ చేసిన సభ్యుడు కొప్పర్ల నాగరాజు గురువారం ఆలయ ఇఓ డి.బాపిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసినట్లు వివరించారు. కొత్తగా నామినేట్ అయిన నాగరాజును ఇఓ బాపిరెడ్డి దుశ్శాలువతో సత్కరించారు. కాగా శ్రీకాళహస్తికి చెందిన ఇరిగేషన్ టెక్నికల్ ఆఫీసర్ వంకీపురం వేణు దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కొత్తగా సభ్యుడుగా నామినేట్ చేసిన నాగరాజు స్వామి అమ్మవార్లను దర్శించుకొని పూజలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, విజయనగరం, అనకాపల్లి జిల్లాల నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు జి.సత్యనారాయణ, పి.రమేష్, రాష్ట్ర సాధికారిక కమిటి సభ్యులు శ్రీనివాసరావు, పి.సత్యనారాయణ రాష్ట్ర సాధికారిత కమిటి సభ్యులు కోటిపల్లి చంద్రశేఖర్ కాకినాడ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు చిప్పల శ్రీను తదితరులు హాజరయ్యారు. నాగరాజును సత్కరించారు.

**SWAYAMBHU SRI VARASIDDI VINAYAKA SWAMI DEVASTHANAM**
**KANIPAKAM (V), Irala (M), Chittoor District**

**e-procurement Tender Notice**

Rc.No.Q1/99/2022 Dated: -10-2025

Tenders are invited for Development works in the premises of Devathanam, Kanipakam. e-procurement registered contractors are requested to download the Tender Bid & BOQ from https://tender.apeprocurement.gov.in tenders site. For further details contact Ph: 08573-281747.

| | | |
|---|---|---|
| 1. Bid Document Download Starting Date | : 21.10.2025 | 1.00pm |
| 2. Bid Document Download Ending Date | : 04.11.2025 | 1.00pm |
| 3. Last Date & Time for Receipt of Bids | : 04.11.2025 | 1.30pm |
| 4. Technical Bid Opening Date | : 04.11.2025 | 2.00pm |
| 5. Price Bid Opening Date | : 04.11.2025 | 4.00pm |

*Executive Officer & Spl.Grade. Deputy Collector*

**MUNICIPAL CORPORATION TIRUPATI**

**QUOTATION NOTICE**

The Commissioner, Municipal Corporation Tirupati Invites Quotations from reputed Architectural/Design Consultancy Firms for providing structural, Architectural and Interior Design Serives for various works at the **Commissioner's Bungalow, Tirupati** (under District Available Funds) including camp office construction, modular kitchen, interior works, road and greenery development, etc. Interested firms may submit their credentials and quotations to the Office of the Commissioner, Tirupati Municipal Corporation on or before 10.10.2025, 4.30pm.

**Commissioner,**
**Municipal Corporation Tirupati**